కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -151 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 13-06-2026 శనివారం పేజీలు : 4


2 లో

# 'వెన్నుపోటుకి రెండేళ్లు' నిరసన జ్వాలలు!

- వైసీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపుతో కదలివచ్చిన శ్రేణులు.. నిలిచిపోయిన రహదారులు
- కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, నమ్మకద్రోహంపై నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు
- సూపర్ సిక్స్ ఎక్కడ? నిరుద్యోగులు, రైతులు, మహిళల గొంతు నొక్కేస్తున్నారంటూ మండిపాటు

అమరావతి (బీఎన్ఎస్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా నిరసన జ్వాలలు మిన్నంటాయి. 'వెన్నుపోటుకి రెండేళ్లు' (రెండు సంవత్సరాల నమ్మకద్రోహం) పేరిట శుక్రవారం నాడు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నేతలు భారీ ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టారు. పలుచోట్ల ప్రధాన రహదారులను దిగ్బంధించి కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నినదించారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఈ నిరసన కార్యక్రమాలు ఉధృతంగా సాగాయి. ఉదయం నుంచే వైసీపీ శ్రేణులు, పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు, నిరుద్యోగ యువత నల్ల బ్యాడ్జీలు ధరించి, నల్ల బెలూన్లు ఎగురవేస్తూ నిరసనలు తెలిపారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను పక్కనబెట్టి, ప్రజలను నిలువునా ముంచేసిందని ఆరోపిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో వైసీపీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల బాండ్లను, మేనిఫెస్టో ప్రతులను ప్రదర్శిస్తూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ 'తల్లీ వందనం' ఇస్తామన్నారు, 'మహాశక్తి' కింద నెలకు రూ.1500 ఇస్తామన్నారు..


2 లో

# స్వర్ణాంధ్రే శ్వాసగా కూటమి సుపరిపాలన!

- రెండేళ్ల ప్రగతి ప్రస్థానం.. తిరుపతి సాక్షిగా ఎన్డీయే 'సంక్షేమం' శంఖారావం
- వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్ ఇచ్చింది: సీఎం చంద్రబాబు నాయుడు

తిరుపతి (బీఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండు సంవత్సరాల పరిపాలనను పూర్తి చేసుకున్న అపూర్వ ఘట్టాన్ని పురస్కరించుకుని తిరుపతి సమీపంలోని దామినీడు వద్ద మూడు భాగస్వామ్య పక్షాల (టీడీపీ, జనసేన, బీజేపీ) ఆధ్వర్యంలో 'సంక్షేమం' పేరిట అత్యంత ప్రతిష్టాత్మకంగా భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ మెగా ఎన్డీయే సభకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కూటమి నాయకులు, శ్రేణులు, అశేష జనవాహిని ఉప్పెనలా తరలివచ్చారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రులు, కూటమి అగ్రనేతలతో కలిసి సీఎం చంద్రబాబు ఈ సభలో పాల్గొని రెండేళ్ల కాలంలో సాధించిన విజయాలను, భవిష్యత్ కార్యాచరణను ప్రజాక్షేత్రంలో ఆవిష్కరించారు.

సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన తిరుపతి గడ్డపైనే, నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి రెండేళ్లు పూర్తి కావడంపై భావోద్వేగానికి లోనయ్యారు. "గత ప్రభుత్వ విధ్వంసకర విధానాల వల్ల వెంటిలేటర్‌పై ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా, వ్యూహాత్మకంగా ఆక్సిజన్ ఇచ్చి కాపాడింది. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే ఒకే ఒక్క మహత్తర ఆశయంతో నాడు మోదీ, పవన్ కళ్యాణ్, నేను కలిశాం. ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని, ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును గుండెల్లో పెట్టుకుని అహర్నిశలు శ్రమిస్తున్నాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

## 21 సీట్లతో రాజీపడలేదు ఏపీ కోసం మేం త్యాగం చేశాం!


2 లో

న్యూస్ డెస్క్, 12 జూన్ (బిఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కూటమి ఏర్పాటులో జనసేన 21 సీట్లతో రాజీపడలేదని, రాష్ట్ర ప్రయోజనాల కోసం త్యాగం చేసిందని స్పష్టం చేశారు. ప్రజలు తమ త్యాగాన్ని గుర్తించి 100 శాతం విజయాన్ని అందించారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం సమిష్టిగా కృషి చేస్తోందని పవన్ తెలిపారు.

# స్కూళ్లకు పాఠ్యపుస్తకాలు

## ఈనెల 15లోగా పూర్తిస్థాయిలో పంపిణీ లక్ష్యం

న్యూస్ డెస్క్, 12 జూన్ (బిఎన్ఎస్): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నూతన విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ చేరవేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఈ ఏడాది విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో విద్యాశాఖ సరికొత్త నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు అందిస్తున్న వర్క్ బుక్స్ 2026-27 విద్యా సంవత్సరం 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సైతం కొత్తగా వర్క్ బుక్స్ పంపిణీ చేయనున్నారు. అభ్యాసన సామర్థ్యాలు పెరగడానికి వర్క్ బుక్స్ ఉపయోగపడుతాయని భావించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, గురుకులాల్లోని 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు సుమారు 12 లక్షల మంది వరకు ఉంటారు. అయితే వర్క్ బుక్స్ ఈ నెలాఖరు లేదా జులై మొదటివారంలో అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.


2 లో

## ఒక్క సీటు కోసం ఇంతలా దిగజారాలా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్


2 లో

## మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి

### సురక్షితంగా బయటపడిన ఆర్ఎస్ఎస్ చీఫ్


2 లో

# 'రప్పారప్పా' అంటే చూస్తూ ఊరుకోము

## నారా లోకేష్ మాస్ వార్నింగ్!


2 లో

న్యూస్ డెస్క్, 12 జూన్ (బిఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతి జిల్లా దామినీడు వేదికగా శుక్రవారం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ముఖ్య అథిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. రప్పారప్పా అంటే తాము చూస్తూ ఊరుకోమని, రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూ పోతుందని ప్రతిపక్షంకు వార్నింగ్ ఇచ్చారు.

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అన్న' అని పేర్కొన్నారు. తనకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. 'ఇప్పుడు ఏపీలో భూతులు లేవు, జేసీబీలు లేవు. అక్రమాలు, దౌర్జన్యాలు కనిపించడం లేదు. ప్రజలకు రెండేళ్లుగా స్వాతంత్ర్యం లభించింది' అని పేర్కొన్నారు.

గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో దేవుడితో పెట్టుకోవద్దు అని చెప్పానని, ఆ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించిన వారి పరిస్థితి ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్.. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు.

## ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్బ..
## పిటిషన్ తిరస్కరణపై మీనాక్షి నటరాజన్ ఆవేదన

మొదటి పేజీ తరువాయి



పిటిషన్ ను రిజెక్ట్ చేయడం కేవలం తన వ్యక్తిగత ఓటమి మాత్రమే కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకే పెద్ద దెబ్బ అని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం పూర్తిగా పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘంలో ఉన్న అధికారులు కేంద్ర ప్రభుత్వ ఒత్తిడులకు లొంగిపోయారని తాను మొదటి నుంచీ చెప్తూనే ఉన్నానన్నారు. నామినేషన్ ను రిజెక్ట్ చేయడంపై తమ పార్టీ ప్రతినిధులు ఈసీని సంప్రదిస్తే 48 గంటలపాటు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని వాపోయారు. ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర విమర్శలు చేసిన ఆమె.. సుప్రీంకోర్టు తీర్పుపై మాత్రం ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనన్నారు. రిటర్నింగ్ అధికారి ఏకపక్ష నిర్ణయం ఇప్పుడు ప్రజలందరికీ అర్థమైందని పేర్కొన్నారు. కాగా.. ఎన్నికల సంఘం ఏకపక్ష వైఖరికి నిరసనగా, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శుక్రవారం ఉదయం దేశ రాజధాని న్యూఢిల్లీలో భారీ ఎత్తున 'సత్యాగ్రహ' నిరసన చేపట్టాయి. ప్రభుత్వ ఒత్తిళ్లకు లొంగి ప్రతిపక్షాల గొంతు నొక్కేలా ఈసీ వ్యవహరిస్తోందని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 'వెన్నుపోటుకి రెండేళ్లు' నిరసన జ్వాలలు!

మొదటి పేజీ తరువాయి



'మహాశక్తి' కింద నెలకు రూ.1500 ఇస్తామన్నారు.. ఇవన్నీ ఏమయ్యాయి?" అంటూ నేతలు ప్రశ్నించారు. చంద్రబాబు తన అలవాటు ప్రకారం మరోసారి ప్రజలకు వెన్నుపోటు పొడిచారని, ఈ రెండేళ్ల కాలంలో అభివృద్ధి శూన్యమని, కేవలం వైఫల్యాలు మాత్రమే మిగిలాయని విమర్శించారు.

ప్రత్యేకించి నిరుద్యోగ యువత మరియు ఉపాధ్యాయ అభ్యర్థులు ఈ నిరసనల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఇటీవల జరిగిన 'డీఎస్సీ-2025' ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, అర్హులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ విద్యార్థి, యువజన విభాగాలు కలెక్టరేట్ల ముట్టడికి యత్నించాయి. ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐతో విచారణ జరిపించాలని, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని వైసీపీ శ్రేణులు డిమాండ్ చేశాయి.

అటు వ్యవసాయ రంగంలోనూ కూటమి ప్రభుత్వం రైతాంగాన్ని నట్టేట ముంచిందని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు పెట్టుబడి సాయం, ఉచిత విద్యుత్ సబ్సిడీల బకాయిలను సకాలంలో చెల్లించకపోవడంతో అన్నదాతలు అప్పులపాలవుతున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీలను ఎగ్గొట్టడం వల్ల ఆ రంగం కుదేలైందని, చంద్రబాబు ప్రభుత్వం కేవలం డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలం వెళ్లదీస్తోందని ఆరోపించారు.

రాష్ట్రవ్యాప్తంగా సాగిన ఈ నిరసనల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు తదితర నగరాల్లో ర్యాలీగా వెళ్తున్న వైసీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ నేతలను, కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేయడాన్ని వైసీపీ తీవ్రంగా ఖండించింది. పోలీసు యంత్రాంగాన్ని వాడుకుని ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలను అణచివేయలేరని హెచ్చరించారు.

కాగా, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి ఈ నిరసన కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించారు. అనంతరం ఆయన స్పందిస్తూ.. కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపించేందుకే ఈ 'వెన్నుపోటుకి రెండేళ్లు' ఉద్యమం చేపట్టామని స్పష్టం చేశారు. "ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని చంద్రబాబు నెరవేర్చలేదు. ఈ వైఫల్యాలను, మోసాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్తాం. ప్రజల పక్షాన వైసీపీ పోరాటం నిరంతరం కొనసాగుతుంది" అని జగన్ ప్రకటించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# స్వర్ణాంధ్రే శ్వాసగా కూటమి సుపరిపాలన!

మొదటి పేజీ తరువాయి

సంపద సృష్టి ద్వారానే పేదలకు సంక్షేమ ఫలాలను అందించడం సాధ్యమవుతుందని, ఆ దిశగానే కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని సీఎం స్పష్టం చేశారు. "రాష్ట్రం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేరుస్తూ మా నిజాయితీని నిరూపించుకుంటున్నాం. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, కొత్త రైల్వే జోన్ సాధన వంటి కీలకమైన అంశాల్లో కేంద్రం మనకు పూర్తి అండగా నిలిచింది" అని ఆయన పేర్కొన్నారు. కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను మూడు ప్రధాన కేంద్రాలుగా చేసుకుని రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలను సమానంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ మహాసభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరియు బీజేపీ అగ్రనేతలు మాట్లాడుతూ.. కూటమిలోని మూడు పార్టీల మధ్య ఉన్న అద్భుతమైన సమన్వయమే ఈ రెండేళ్ల విజయవంతమైన పాలనకు మూలస్తంభమని కొనియాడారు. గత పాలకుల అరాచకాలను తుడిచిపెట్టి, రాష్ట్రాన్ని తిరిగి ప్రగతి పట్టాలెక్కించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం అద్భుతంగా పనిచేసిందని ప్రశంసించారు. 'స్వర్ణాంధ్ర ప్రదేశ్' సాధనే లక్ష్యంగా, రాబోయే మూడేళ్లలో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రజా రక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం మరింత వేగంగా దూసుకుపోతుందని నేతలు ఉద్ఘాటించారు.

## మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి
## సురక్షితంగా బయటపడిన ఆర్ఎస్ఎస్ చీఫ్



న్యూస్ డెస్క్, 12 జూన్ (బిఎన్ఎస్): రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై గుర్తుతెలియని దుండగులు రాళ్లు రువ్విన ఘటన ఉత్తరప్రదేశ్‌లో తీవ్ర కలకలం రేపింది. ఫిరోజాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఈ రాళ్ల దాడిలో మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న ఏసీ ఫస్ట్ క్లాస్ బోగీ (ఈ1) కిటికీ అద్దాలు పగిలిపోయాయి. అయితే, ఈ ప్రమాదంలో మోహన్ భాగవత్‌తో పాటు ప్రయాణికులెవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రైల్వే అధికారుల కథనం మేరకు కాన్పూర్ నుంచి ఢిల్లీ వైపు వెళ్తున్న స్వర్ణ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రాత్రి 7.15 గంటల సమయంలో ఫిరోజాబాద్‌లోని రసూల్‌పూర్, దక్షిణ్ పోలీస్ స్టేషన్ సరిహద్దు ప్రాంత గుండా వెళ్తోంది. ఈ క్రమంలోనే కొందరు దుండగులు ఒక్కసారిగా రైలుపైకి రాళ్లు విసిరారు. ఓ పెద్ద రాయి మోహన్ భాగవత్ కూర్చున్న సీటు వైపు ఉన్న కిటికీకి బలంగా తగిలింది. దీంతో కిటికీ బయటి వైపు ఉన్న గ్లాస్ పూర్తిగా పగిలిపోయింది. ఆ సమయంలో యూపీ పంచాయతీ రాజ్ మంత్రి భూపేంద్ర చౌదరి కూడా అదే బోగీలో ప్రయాణిస్తున్నట్లుగా సమాచారం.

అప్రమత్తమైన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్..

అయితే, ఘటన జరిగిన వెంటనే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ), గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్పీ) ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఆగ్రా జోన్ ఏడిజీ ఎస్‌కే భగవత్, ఫిరోజాబాద్ ఎస్ఎస్పీ ఆదిత్య లాంగే స్పాట్‌కు చేరుకున్నారు. రైలును కాసేపు తుండ్లా జంక్షన్ వద్ద నిలిపివేసి తనిఖీలు చేసిన అనంతరం ఢిల్లీకి సురక్షితంగా పంపేశారు. ఈ దాడికి సంబంధించి పోలీసులు ఇప్పటికే అనుమానితుడైన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రైల్వే ట్రాక్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, నిందితులను త్వరలోనే గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఎస్పీ ఆదిత్య లాంగే తెలిపారు.

## ఒక్క సీటు కోసం ఇంతలా దిగజారాలా
## టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్



న్యూస్ డెస్క్, 12 జూన్ (బిఎన్ఎస్): తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇవాళ ఆయన జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకుని కుట్రపూరితంగానే వ్యవహరించిదని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో మీనాక్షి నటరాజన్ ఎంతో నిబద్ధత, నిజాయితీ కలిగిన మహిళా నాయకురాలని అన్నారు. అలాంటి లీడర్ రాజ్యసభ నామినేషన్‌ను మధ్యప్రదేశ్‌లో తిరస్కరించడం అత్యంత అన్యాయమని అన్నారు. తనకు తెలిసినంత వరకు ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, కోర్టుల్లో ఎలాంటి వివాదాలు పెండింగ్‌లో లేవన్నారు. కనీసం ఆమె రాజకీయ జీవితంలో ఎలాంటి నిరసనలు, రాస్తారోకోలు, రాజకీయ గొడవల్లో పాల్గొన్నట్లుగా కూడా రికార్డుల్లో లేదన్నారు. ఆమె వ్యక్తిగత జీవితంలోనూ ఎలాంటి చట్టపరమైన సమస్యలు లేకుండా.. అంతటి క్లీన్ రికార్డ్ ఉన్న నేతను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గమని జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈసీని ముందు పెట్టి రాజకీయం..

మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం కావాలనే ఎన్నికల సంఘాన్ని వాడుకుని మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురయ్యేలా చేసిందని జగ్గారెడ్డి విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని ముందు నిలబెట్టి, ఓ రకంగా తాము అనుకున్న కుట్రలో విజయం సాధించిందని అన్నారు. ఒక్క సీటు కోసం ఇంతలా దిగజారి రాజకీయాలు చేయాల్సిన అవసరం ఏముందని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ పెద్దల హస్తం ఉందంటూ సంచలన ఆరోపణలు చేశారు. విపక్ష నాయకులను టార్గెట్ చేయడానికి వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారంటూ జగ్గారెడ్డి ధ్వజమెత్తారు.

# స్కూళ్లకు పాఠ్యపుస్తకాలు..
## ఈనెల 15లోగా పూర్తిస్థాయిలో పంపిణీ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి




పాఠ్యపుస్తకాలు ఇప్పటికే మండల కేంద్రాల నుంచి స్కూళ్లకు చేరుకోగా నోట్ బుక్స్ ఇంకా చేరలేదు. పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే పలు సూచనలు చేసింది.

రోజువారీ పర్యవేక్షణకు ఆదేశాలు..

పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ డీఈఓలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రవాణా, పంపిణీలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా రోజువారీ సరఫరా నివేదికలను ట్రాక్ చేయాలని స్పష్టం చేశారు. గతేడాది నాగర్‌కర్నూల్ జిల్లాలో విద్యార్థులతో కలిసి బుక్స్ ట్రాలీలో తీసుకొస్తుండగా బోల్తా పడింది. అందులో విద్యార్థులు ఉండడాన్ని విద్యాశాఖ సీరియస్‌గా తీసుకుంది. ఈ ఏడాది అలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని, పాఠశాల ప్రారంభం నాటికే బుక్స్‌తోపాటు అన్ని మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ నెల 15వ తేదీలోపు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వంద శాతం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, అందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

## 'రప్పారప్పా' అంటే చూస్తూ ఊరుకోము..
## నారా లోకేష్ మాస్ వార్నింగ్!

మొదటి పేజీ తరువాయి



వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన లోకేష్.. 'టీడీపీ జెండా లేకుండా చేస్తామని చెప్పారు. కానీ ప్రజలే వారి జెండాను పీకేశారు' అని అన్నారు. ప్రస్తుతం కొందరు 'రప్పారప్పా' అంటూ హెచ్చరికలు చేస్తున్నారని.. అయితే తాము చూస్తూ కూర్చోమన్నారు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ పోతుందని హెచ్చరించారు. అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి మధ్య తేడాను వివరిస్తూ నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'మాది గూగుల్ అయితే.. వారిది గొడ్డలి. మనది కియా అయితే.. వారిది కిడ్నాప్' అని విమర్శించారు. అలాగే 'జగన్ అంటే జెన్-జీ కాదు, జగన్ అంటే గొడ్డలి' అంటూ ఎద్దేవా చేశారు. జగన్‌కు క్రెడిట్ తీసుకునే అలవాటు ఉందని ఆరోపించిన లోకేష్.. 'రానున్న రోజుల్లో స్వాతంత్ర్యాన్ని కూడా మా తాత తెచ్చాడని జగన్ చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చే ప్రతి రూ.100 పెట్టుబడుల్లో రూ.25 ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం పెరిగిందని లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు.

# రాజకీయాల్లోకి రాఘవ లారెన్స్
## పరిస్థితులే నన్ను ఈ స్థాయికి తెచ్చాయంటూ సంచలన పోస్ట్



న్యూస్ డెస్క్, 12 జూన్ (బిఎన్ఎస్): తమిళనాడు రాజకీయాల్లో రోజుకో కొత్త మార్పు చోటుచేసుకుంటోంది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రాజీనామా చేసిన తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికపై ఆసక్తికర చర్చ మొదలైంది. ఈ ప్రతిష్టాత్మక స్థానంలో విజయ్ టీవీకే పార్టీ తరపున నటుడు రాఘవ లారెన్స్ పోటీ చేసే అవకాశం ఉన్నట్లు గత కొద్ది కాలంగా వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. తాజాగా కొరియోగ్రాఫర్, నటుడు రాఘవ లారెన్స్ సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ ఇప్పుడు రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోందిరాఘవ లారెన్స్ తన పోస్ట్‌లో స్పందిస్తూ.. "నేను ఎప్పుడూ నిజాయితీగా, నా బాధ్యతను సక్రమంగా నిర్వహించాలనే అనుకున్నాను. కానీ, ఒకరోజు నేను రాజకీయాల్లోకి వస్తానని కలలో కూడా ఊహించలేదు. నాకు రాజకీయాల్లోకి రావాలనే కోరిక గానీ, రాజకీయం ద్వారా డబ్బు సంపాదించాలనే ఆశ గానీ, ఏదైనా పెద్ద పదవిని దక్కించుకోవాలనే లాలస గానీ ఎప్పుడూ లేదు.

నేను నమ్మిన వ్యక్తి, నాకు అత్యంత సన్నిహితుడైన ఒకరు రాజకీయాల్లోకి వస్తే.. వారికి మద్దతుగా నిలిచి, నేను వ్యక్తిగతంగా చేస్తున్న సేవా కార్యక్రమాల కంటే పెద్ద ఎత్తున ప్రజలకు సేవ చేయాలని మాత్రమే అనుకున్నాను. కానీ, నేటి పరిస్థితులు నన్ను రాజకీయాల్లోకి అడుగుపెట్టేలా చేశాయి" అని పేర్కొన్నారు. రాజకీయాలపై తన మనసులోని మాటను పంచుకుంటూ.. " రాజకీయంపై నా అభిప్రాయం ఏంటి? అది నా జీవితంలోకి ఎలా వచ్చింది? రాజకీయాలపై నా తల్లి ఆలోచనలు ఏంటి? అలాగే నా ప్రయాణాన్ని మార్చిన కొన్ని ముఖ్యమైన, ఆసక్తికరమైన సంఘటనలు ఏంటనే విషయాలను ఎలాంటి దాపరికం లేకుండా, పూర్తి నిజాయితీతో వీడియోలో పంచుకున్నాను" అని లారెన్స్ వెల్లడించారు. తన రాజకీయ ప్రయాణంపై అభిమానులకు, ప్రజలకు లారెన్స్ ఒక కీలకమైన విజ్ఞప్తి చేశారు.

ఎటువంటి స్వార్థం, ప్రతిఫలం ఆశించకుండా ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆయన కోరారు. తన వీడియో చూసిన తర్వాత ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన సలహాలను, మార్గదర్శకత్వాన్ని కామెంట్ల రూపంలో తెలియజేయాలని అన్నారు. ఒకవేళ ప్రజలు వద్దని చెబితే, తాను ఎంత మాత్రం రాజకీయాల్లోకి ప్రవేశించనని ఆయన స్పష్టం చేశారు. రాజకీయాలకు దూరంగా ఉంటూనే సమాజానికి తాను చేస్తున్న నిస్వార్థ సేవలను ఎప్పటిలాగే కొనసాగిస్తానని చెప్పారు. అలా కాకుండా ప్రజలంతా రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటే మాత్రం.. అందరి ఆశీస్సులతో, తాను అనుకున్న వ్యక్తులతో కలిసి ఈ సరికొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించడానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నానని లారెన్స్ తన మనసులోని మాటను బయటపెట్టారు. ఈ ప్రకటనతో తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి.

## పవన్ కల్యాణ్‌కు తెలంగాణలో పూర్తి స్వేచ్ఛ ఉంది
## సభకు అనుమతి నిరాకరణపై సీఎం రేవంత్ క్లారిటీ



న్యూస్ డెస్క్, 12 జూన్ (బిఎన్ఎస్): జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, తెలంగాణలో ఎవరైనా రాజకీయాలు చేయవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ పర్యటనలు, శాంతిభద్రతలు మరియు మధ్యప్రదేశ్ ఎన్నికల పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. జూన్ 2వ తేదీన తెలంగాణలో పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై స్పష్టత ఇచ్చారు. కేవలం శాంతి భద్రతలను పరిగణలోకి తీసుకుని మాత్రమే పోలీసులు ఆ నిర్ణయం తీసుకున్నారని, దీని వెనుక ఎలాంటి రాజకీయ కారణాలు లేవన్నారు. "తెలంగాణలో పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది. ఆయనకు నచ్చినట్లు ఆయన రాజకీయాలు చేసుకోవచ్చు. ఇక్కడ ఎవరైనా పోటీ చేయడానికి అర్హులే" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

ఓట్ చోరీ అయిపోయింది.. ఇప్పుడు సీట్ చోరీ: బీజేపీపై ఫైర్

ఇదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, మధ్యప్రదేశ్ ఎన్నికల పరిణామాలపైనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌ను బీజేపీ నేతలు ఆదర్శంగా తీసుకున్నట్లు కనిపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై ఆయన మండిపడుతూ.. ఇది ముమ్మాటికీ కుట్రపూరిత చర్యేనని ఆరోపించారు. "మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవు. అయినప్పటికీ ఆమె నామినేషన్ను తిరస్కరించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. మధ్యప్రదేశ్‌లో రిటర్నింగ్ అధికారి పూర్తిగా తప్పుగా వ్యవహరించారు. దేశంలో మొదట ఓట్ల చోరీ జరిగింది.. ఇప్పుడు ఏకంగా సీట్ల చోరీకి పాల్పడుతున్నారు" అంటూ సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని వెక్కిరిస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 21 సీట్లతో రాజీపడలేదు.. ఏపీ కోసం మేం త్యాగం చేశాం!

మొదటి పేజీ తరువాయి

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవడంలో అందరి సహకారం కీలక పాత్ర పోషించిందని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని జనసేనాని చెప్పుకొచ్చారు.

వ్యవస్థలు బలహీనపడినప్పుడు కులం, ప్రాంతీయత వంటి అంశాలు ముందుకు వస్తాయని పవన్ కళ్యాణ్ అన్నారు. తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలంటే ఒక రాష్ట్రం కుల రాజకీయాలను అధిగమించాలని, మరో రాష్ట్రం ప్రాంతీయత భావనను దాటాలని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో సంస్థల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. 'ప్రజలు పార్టీలను మాత్రమే కాకుండా వ్యవస్థలను కూడా నమ్మాలి. నాయకులను కాకుండా సంస్థలను విశ్వసించాలి. వ్యక్తులను కాకుండా విలువలను ఆదర్శంగా తీసుకోవాలి. అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం, గ్రామ స్వరాజ్యం సాకారం అవుతాయి' అని పవన్ అన్నారు.



రాష్ట్రంలో 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. గత రెండేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, మౌలిక వసతుల అభివృద్ధితో పాటు దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించే ప్రయత్నం చేశామని వివరించారు. గ్రామస్థాయిలో ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెంచేందుకు కృషి చేశామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీల పరిస్థితి దయనీయంగా ఉండేదని విమర్శించారు. కనీస అవసరాలకు కూడా నిధులు లేని పరిస్థితులు ఉండేవని, తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత పంచాయతీ రాజ్ వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేశానని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేసిన పవన్.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాకుండా భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తనకు ప్రజాసేవ చేసే అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రజలకు పవన్ కళ్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై భారీ నిరసన బైక్ ర్యాలీ

## వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు -- ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తిన పట్టణం



అనకాపల్లి జిల్లా, జూన్ 12 : కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ పాయకరావుపేటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కంబాల జోగులు, హైమావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కంబాల జోగులు, చిక్కాల రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే ఒక్క సంక్షేమ కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం సమర్థంగా అమలు చేయలేదని విమర్శించారు. విద్య, వైద్యం, ఉపాధి, ఆరోగ్యశ్రీ వంటి కీలక రంగాల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం మానేసి అక్రమ అరెస్టులు, వేధింపులకే పరిమితమైందన్నారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగానే పాయకరావుపేటలో ఈ బైక్ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. వందలాది మంది ప్రజలు, పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా పాల్గొనడం ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనమని పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే హైమావతి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతి నిరుద్యోగ యువకుడికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పటివరకు ఆ హామీని అమలు చేయలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను కూడా కొనసాగించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఆర్థిక చేయూత అందిస్తామని చెప్పిన హామీతో పాటు 'సూపర్ సిక్స్' పేరుతో ప్రకటించిన పథకాలలో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదని ఆరోపించారు. ప్రజలు తమ హక్కుల కోసం గొంతు విప్పితే అక్రమ కేసులు బనాయిస్తున్నారని, రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు, వీసం రామకృష్ణ, గెడ్డమూరి శ్రీనివాసరావు, పడాల సోమన్న దొర, జగతా శ్రీను, ధనిశెట్టి మహేష్, శీరం నరసింహమూర్తి, సూరకాసుల గోవింద్, ధనిశెట్టి బాబి, బొడ్డు హరిబాబు, చోడిపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు. నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం.. ఇల్లు, నగదు, సామగ్రి బూడిద



భీమిలి బిఎన్ఎస్ న్యూస్ భీమునిపట్నం మండలం రెవిడి పంచాయతీ రౌతుల పాలెం గ్రామం దగ్గరలో ఉన్న పతివాడ కల్లాలు లో రాత్రి 11 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది ఈ ప్రమాదంలో పతివాడ పైడ్రాజు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది ఊరికి కొంచెం దూరం ఉండటం వల్ల అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు స్థానికులు నిద్రమత్తులో ఉండటం వల్ల మంటలను అదుపుచేయలేక పోయారు ప్రమాదం జరిగిన చోట ఎవరూ లేకపోవడం దీనికి ముఖ్య కారణం అని స్థానికులు చెపుతున్నారు ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించిందని ఈ ప్రమాదంలో ఇంటి యజమాని పతివాడ పైడ్రాజు దాచుకున్న సుమారు 40 వేల రూపాయలు మరియు సామాగ్రి 15 నాటు పుంజులు కాళీ బూడిదయ్యాయి విషయం తెలుసుకున్న స్థానికులు నాయకులు సంఘటన స్థలానికి చేరుకునే బాధితుడికి పరామర్శించి నష్టపరిహారాన్ని సుమారు రెండు లక్షల రూపాయల పరిహారాన్ని ప్రభుత్వానికి తెలియజేసి నష్ట పరిహారాన్ని బాధితుడు కుటుంబానికి అందజేస్తామని తెలియజేశారు.

# డీజిల్ ఆదా కోసం సాంకేతిక పద్ధతులతో మైలేజీ పెంపు : ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి




హైదరాబాద్(బీఎన్ఎస్) : ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభం, నిరంతరం పెరుగుతున్న డీజిల్ ధరల నేపథ్యంలో సంస్థపై పడుతున్న భారీ నిర్వహణ భారాన్ని తగ్గించుకునేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని టీజీఎస్ ఆర్టీసీ వీసీ & ఎండీ వై. నాగిరెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ 'బస్ భవన్'లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "డీజిల్ నిర్వహణ -- అవగాహన సదస్సు" లో ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ఇంధన ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ఇది రవాణా రంగంపై, ముఖ్యంగా ఆర్టీసీపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ ఆర్థిక భారాన్ని సమర్థవంతంగా అధిగమించాలంటే డీజిల్ వినియోగాన్ని క్రమబద్ధీకరించడం, ప్రతి లీటరు ఇంధనాన్ని పొదుపుగా వాడుతూ వృథాను అరికట్టడం ఒక్కటే సరైన మార్గమని ఎండీ స్పష్టం చేశారు. ఇందుకోసం డిపోల స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని గరిష్టంగా ఉపయోగించుకోవాలని, వాహనాల ఫిట్‌నెస్‌తో పాటు ఉత్తమ నిర్వహణ పద్ధతులను నిరంతరం అలవర్చుకోవాలని అధికారులకు, సాంకేతిక సిబ్బందికి సూచించారు. కేవలం ఇదొక విధి నిర్వహణ మాత్రమే కాదని, ప్రతి ఉద్యోగికి ఇంధన పొదుపుపై ఒక సామాజిక బాధ్యత ఉండాలని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి డీజిల్‌ను ఆదా చేయడం ద్వారా సంస్థను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కూడా మన వంతు సహకారం అందించినవారమవుతామని పేర్కొన్నారు.

ఈ అవగాహన సదస్సులో ఈడీ సిహెచ్.వెంకన్న, ఫైనాన్సియల్ అడ్వైజర్ విజయపుష్ప, బీపీసీఎల్ ( I & C) తెలంగాణ హెడ్ లక్ష్మీ లాల్ చౌహాన్ , మార్కెటింగ్ మేనేజర్ రఘునాథరావ్, ఆర్టీసీ సీసీఎస్ ప్రభులత, పలువురు డిప్యూటీ ఆర్ఎం లు, డిపో మేనేజర్లు పాల్గొన్నారు. డెపోలలో ని గ్రౌండ్ ట్యాంక్ ల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. అదేవిధంగా బస్సుల డీజిల్ మైలేజీని (KMPL) గణనీయంగా పెంచడానికి, గ్యారేజ్ పరిధిలో సాంకేతిక లోపాలను సకాలంలో గుర్తించి నివారించడానికి తీసుకోవాల్సిన వివిధ రకాల జాగ్రత్తలపై ఈ సందర్భంగా నిపుణులు సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.

# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు



కడపజిల్లా (బిఎన్ఎస్) జూన్12: చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు అంటూ రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి సూచనల మేరకు పెద్ద ఎత్తున ర్యాలీలు చేసి వినతి పత్రాల సమర్పించే కార్యక్రమంలో భాగంగా కడపజిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పెద్ద ఎత్తున వైయస్ఆర్సీపీ నాయకులు,కార్యకర్తలతో కలిసి ర్యాలీలు చేపట్టారు.

కమలాపురంనియోజకవర్గంలో వైయస్సార్సిపి ఆధ్వర్యంలోకూటమిపాలనకు రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా పెద్ద ఎత్తున ప్రభుత్వంపై నిరసన ర్యాలీ చేపట్టారు. ఈర్యాలీలో పాల్గొన్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి తోపాటు వైఎస్ఆర్సిపి నాయకుల, కార్యకర్తల ఆధ్వర్యంలో పట్టణంలోని గ్రామచావిడి నుంచి తహసీల్దార్

కార్యాలయం వరకు ర్యాలీ తో కొనసాగి స్థానిక ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున తరలివచ్చిన నాయకులు,కార్యకర్తలను ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ..నేటికీ కూటమిపాలన వచ్చి రెండు సంవత్సరాల అవుతుందని, టిడిపి,బిజెపి,జనసేన మూడు పార్టీలు కలిసి సూపర్ సిక్స్,సూపర్ సెవెన్ అంటూ అనేక హామీలు ఇచ్చారు.ఆ హామీలన్నీ నిజమే అని ప్రజలు నమ్మి పెద్ద ఎత్తున ఓట్లు వేసి చంద్రబాబుకు పట్టం కట్టారు. కానీ, హామీలను గాలికి వదిలేశారంటూ మండిపడ్డారు. ఈ నిరసనలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు

## -- కూటమి ప్రభుత్వ మోసాలపై నిరసన కార్యక్రమం చేపట్టిన డీఎస్సీ, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయి రైతుకు పెట్టుబడి సాయం, 50 ఏళ్లకే పెన్షన్ హామీలపై నిలదీత




రావులపాలెం (బిఎన్ఎస్)జూన్ 12: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి. కూటమి ప్రభుత్వ పరిపాలనా వైఫల్యాలు నిరసిస్తూ వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో రావులపాలెంలో శుక్రవారం జరిగిన వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమం వైసిపి నేతల నిరసనలతో హోరెత్తింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు పాటి శివకుమార్ పాల్గొన్నారు.

రావులపాలెం డిగ్రీ కళాశాల గ్రౌండ్ నుండి రావులపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు,అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు మెగా డీఎస్సీ, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, రైతుకు పెట్టుబడి సాయం, 50 ఏళ్లకే పెన్షన్ వంటి కీలక హామీలు నేటికీ అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మద్యం విధానం, గ్యాస్, వంటనూనె, పెట్రోల్, డీజిల్ వంటి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఇసుక, మట్టి సమస్యలతో నిర్మాణ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికే "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు...

# రాజమండ్రి రూరల్ కోటిపల్లి బస్టాండ్ సెంటర్ వద్ద ఈరోజు వెన్నుపోటుకు 2 సంవత్సరాలు కార్యక్రమం...



రాజమండ్రి రూరల్, (బిఎన్ఎస్) జూన్ :12 రెండేళ్ల పాలనపై విజయోత్సవాలు చేసుకుంటున్న కూటమి ప్రభుత్వాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్. రాజమండ్రి కోటిపల్లి బస్టాండ్ జంక్షన్ లో జిల్లా పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు ఆధ్వర్యంలో

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రూరల్ నియోజకవర్గ భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సుష్క వాగ్దానాలు తప్ప, శూన్యం తప్ప కూటమి చేసింది ఏమీ లేదని విమర్శించారు. ఏ ఒక్క హామీని అమలు చేయకుండా బూటకపు హామీలతో డైవర్షన్ పాలిటిక్స్ తో నెట్టుకొస్తున్న ఈ ప్రభుత్వం గుట్టు రట్టు అయిందన్నారు.కూటమి ప్రభుత్వ డొల్లతనాన్ని ప్రజలు గుర్తించారని,అందుకే వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం పేరిట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపుకు విశేష స్పందన లభించిందని వేణు చెప్పారు...

# వెన్నుపోటుకు రెండేళ్లు" భారీ నిరసన ర్యాలీ విజయవంతం




వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమంలో భాగంగా భీమిలి నియోజకవర్గం మధురవాడలోని మిధునాపురి ఉడా కాలనీ గాంధీ విగ్రహం వద్ద నుండి రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించబడింది.

ఈ కార్యక్రమం విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ ర్యాలీలో శ్రీమతి మజ్జి సిరి సహస్ర (సిరమ్మ) పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్ కుమార్ హాజరయ్యారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ, గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నేటికీ అమలుకాక ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో జాప్యం, నిరుద్యోగ సమస్య, రైతులు, మహిళలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు.

# గుండె మార్పిడితో పునర్జన్మ పొందిన యువకుడు




విజయవాడ: కేవలం 23 ఏళ్ల వయసులోనే తీవ్రమైన గుండె జబ్బు బారిన పడి, కార్డియాక్ అరెస్ట్ నుంచి కోలుకున్న గుండిమెడ వేద ప్రకాష్ అనే యువకుడు గుండె మార్పిడి శస్త్రచికిత్సతో పునర్జన్మ పొందాడు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్య నిపుణులు ఈ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసి అతనికి నూతన జీవితాన్ని ప్రసాదించారు. గత మూడేళ్లుగా ఊపిరి అందకపోవడం, గుండెదడ వంటి సమస్యలతో బాధపడుతున్న వేద ప్రకాష్‌కు గుండె రిథమ్ సమస్యలు ఉన్నాయని గుర్తించారు. భవిష్యత్తు ప్రమాదాల నివారణకు మొదట ఏఐసీడీ పరికరాన్ని అమర్చినప్పటికీ, గుండె మార్పిడి ఒక్కటే శాశ్వత పరిష్కారమని వైద్యులు తేల్చి చెప్పారు.

ఈ నేపథ్యంలో పలు ఆసుపత్రులు తిరస్కరించినప్పటికీ, వేద ప్రకాష్ చివరి ప్రయత్నంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌ను ఆశ్రయించి 'జీవన్‌దాన్' పథకం ద్వారా గుండె మార్పిడి కోసం నమోదు చేసుకున్నాడు. అరుదైన ఈ గుండె మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతం చేసి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడికి పునర్జన్మ అందించిన ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్య బృందాన్ని పలువురు అభినందిస్తున్నారు.

# శేరిలింగంపల్లిలో వరద ముప్పుపై అప్రమత్తం



శేరిలింగంపల్లి (బిఎన్ఎస్) : వర్షాకాలం నేపథ్యంలో శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని వాటర్ లాగింగ్ పాయింట్లు, మల్కాం చెరువును జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీలలో ఉప కమిషనర్, ఇంజనీరింగ్, హైడ్రా, సాగునీటి శాఖ అధికారులతో కలిసి పలు ప్రాంతాలను సందర్శించారు.

ఈ సందర్భంగా అధికారులు ప్రస్తుత పరిస్థితులు, డ్రైనేజీ ప్రవాహ మార్గాలు, వర్షపు నీటి పారుదల వ్యవస్థలను క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరంపై చర్చించారు. వాటర్ లాగింగ్‌కు గురయ్యే ప్రాంతాల్లో తక్షణమే సరిదిద్దే చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. అలాగే వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ వరద ఉపశమన చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

మల్కాం చెరువు పరిసర ప్రాంతాల్లో నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాకాలంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు పనిచేయాలని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ స్పష్టం చేశారు.

# ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలు దాటేందుకు యత్నం.. రైలు ఢీకొని ఒకరి మృతి



కొత్తవలస: మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన విజయనగరం జిల్లా కొత్తవలసలో శుక్రవారం చోటుచేసుకుంది.

తుమ్మికాపల్లి పంచాయతీ శివారు ఒడ్డుపేట గ్రామానికి చెందిన నెట్టి నారాయణరావు(40) పెయింటింగ్ పనులు చేస్తుంటారు. కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటితే విశాఖపట్నం–అరకు 516బి జాతీయ రహదారిపైకి ఈ ప్రాంతీయులు చేరుకుంటారు. రోజువారీ పనులకు శుక్రవారం ఉదయం బయలుదేరిన నారాయణరావు ఫోన్ మాట్లాడుతూ పట్టాలు దాటే క్రమంలో రైలు వస్తున్న విషయాన్ని గుర్తించలేకపోయారు. దీంతో విశాఖ నుంచి విజయనగరం వెళ్తున్న రైలు ఈయనను బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఇతనికి భార్య, ఏడేళ్ల కుమార్తె, ఆరేళ్ల కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద మృతిచెందటంతో తమకు దిక్కెవరని భార్య కన్నీరుమున్నీరుగా విలపించారు.

# కడప కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన అసిస్టెంట్ కలెక్టర్లు..!



కడపజిల్లా(బిఎన్ఎస్)జూన్12: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లాకు వచ్చిన ఎనిమిది మంది అసిస్టెంట్ కలెక్టర్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలుతెలియజేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాల క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం జిల్లాలోని సుప్రసిద్ధ పర్యాటక కేంద్రం గండికోటను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్ల బృందం.. అనంతరం రాష్ట్రానికే స్ఫూర్తిగా జిల్లా కలెక్టర్ వినూత్న అవిష్కరణతో అమలులోకి వచ్చిన స్మార్ట్ కిచెన్ వ్యవస్థను ప్రత్యక్షంగా పరిశీలించారు. అందులో భాగంగా ఎర్రగుంట్ల స్మార్ట్ కిచెన్ భవనాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం కడపలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిని ఆయన బంగ్లాలోమర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ దంపతులు వారితో కలిసి మధ్యాహ్న విందును చేసి..చక్కటి ఆతిధ్యం అందించారు.శిక్షణలో భాగంగా పరిపాలన సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్ నుండి పలు సూచనలు,సలహాలను స్వీకరించిన అసిస్టెంట్ కలెక్టర్లు కడపజిల్లా చారిత్రక వైభవానికి ఫిదా అయ్యామని ఇక్కడి పర్యాటక వనరులు, ఇక్కడి ప్రజల స్వభావం, జీవనశైలి మమకారం మేళవించినట్లుందని సంతోషం వ్యక్తం చేశారు.మొదటిసారిగా జిల్లాకు వచ్చిన అసిస్టెంట్ కలెక్టర్లకు చిరు కానుకను అందజేసి సత్కరించారు. కాగా చక్కటి ఆతిధ్యం అందించిన జిల్లా కలెక్టర్ దంపతులకు వారు ధన్యవాదాలుతెలియజేసారు.

సాయంత్రం జిల్లాలోని చారిత్రక,పురాతన శ్రీ ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయంలను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్ల బృందం జిల్లాలో పర్యటనను ముగించుకుని వెళ్లారు.క్షేత్రస్థాయిపర్యటనకు వచ్చిన వారిలో అసిస్టెంట్ కలెక్టర్లు సిహెచ్.శ్రవణ్ కుమార్ రెడ్డి,(ఏలూరు), హరిఓం పాండ్య (శ్రీకాకుళం) జిల్లా,ఆదిత్య శర్మ (తూర్పుగోదావరి),నమ్రత్ అగర్వాల్ (కృష్ణా),పవన్ తేజ ఏఆర్(ఎస్పీఎస్ నెల్లూరు), ప్రియా (కాకినాడ),సుయాస్ కుమార్ (అనంతపురం), వెంకటేష్ బన్న (చిత్తూరు) ఉన్నారు. ఈకార్యక్రమంలో వారివెంట జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేష్ కుమార్, స్మార్ట్ కిచెన్స్ జిల్లా నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్,రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

# వెన్నుపోటు కి రెండేళ్లు.. అంబటి రాంబాబు



గుంటూరు (బిఎన్ఎస్): ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని వైఎస్ఆర్సిపి గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరులోని లాడ్జి సెంటర్లో డీఎస్సీ దిష్టిబొమ్మను పోలీసులు అడ్డుకోగా టిడిపి మేనిఫెస్టోను కాల్చి నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఏసురత్నం,మాజీ మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు వెన్నుపోటుకు 2 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్సిపి నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. సూపర్ సిక్స్ లో భాగంగా ఇచ్చిన ఏ ఒక్క హామీ ను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను దగా చేసిందని మండిపడ్డారు.

సూపర్ సిక్స్ పథకంలో ముఖ్యంగా స్త్రీ నిధి పథకం 1500 రూపాయలు ఇస్తానని స్త్రీలను మోసం చేశారని విమర్శించారు.

నారా లోకేష్ యువగళం యాత్రలో నిరుద్యోగులకి ప్రతినెల 3వేలు రూపాయలు ఇస్తామని దగా చేశారని దుయ్యబట్టారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ మహిళలకు 50 సంవత్సరాలు నిండితే ఫెన్షన్ ఇస్తామని మహిళలను వెన్నుపోటు పొడిచారని ఎద్దేవా చేశారు. మహిళల అక్రమ రవాణా జరిగిందని గొంతు చించుకున్న పవన్ కళ్యాణ్ నోరు ఎందుకు మెదపటం లేదని ప్రశ్నించారు.

# 'వెన్నుపోటుకు రెండేళ్లు.....

## తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో...
## భారీ మోటర్ సైకిల్ ర్యాలీ....



మండపేట(బిఎన్ఎస్)జూన్ :12

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పక్కనబెట్టి "బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ" అన్న నానుడిని చంద్రబాబు ప్రతిరోజూ తన వైఫల్యాలతో రుజువు చేస్తున్నారని విమర్శించారు మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు .. మండపేట రాజారత్న సెంటర్ వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం కు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సూపర్‌సిక్స్‌తో సహా, మ్యానిఫెస్టో కాపీ, పవన్‌కల్యాణ్, చంద్రబాబునాయుడు ఫొటోలతో సంతకాలు చేసి, ప్రతి ఇంటికి పంపించిన బాండ్ల కాపీలు చూపిస్తూ భారీ ర్యాలీ గా వచ్చారు.తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం నిర్వహించారు.

డీఎస్సీ--2025లో జరిగిన అక్రమాలు, అవకతవకలను ప్రస్తావిస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం మెయిన్ రోడ్, కరాచీ సెంటర్, కలువపువ్వు సెంటర్, కేపీ రోడ్డు, రథం సెంటర్, రావి చెట్టు జంక్షన్, తహసీల్దార్ కార్యాలయం కు చేరుకున్నారు. అక్కడ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు విజయవంతం అయ్యాయన్నారు .గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ డీఎస్సీలో నియమాలు ఇష్టానుసారం మార్చి, కొత్తగా జీఓలు జారీ చేసి, స్పోర్ట్స్ కోటా పోస్టులు అడ్డగోలుగా భర్తీ చేసినట్లు ఆరోపణలు చేశారు. దీంతో అన్యాయానికి గురైన డీఎస్సీ అభ్యర్థులు ఆవేదన చెందుతుండగా డీఎస్సీ--2025పై సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలనను పూర్తిగా పక్కనబెట్టి, ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తూ రాష్ట్రాన్ని ఒక 'జంగిల్ రాజ్'గా మార్చేశారని ఆయన మండిపడ్డారు. ఈ రెండేళ్ల కాలంలో ప్రజలకు ఫలానా మంచి చేశానని ధైర్యంగా చెప్పుకునే పరిస్థితి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఏ కోశానా లేదని, ప్రభుత్వ ప్రోగ్రెస్ రిపోర్ట్ చూస్తే అత్యంత ఘోరంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఎల్లో గ్యాంగ్‌తో కలిసి వైసీపీని ఒక భూతంలా చూపే కుట్రపూరిత ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, అమరావతికి ప్రత్యామ్నాయంగా తాము అత్యంత ప్రాక్టికల్‌గా ఉండే 'మావిగన్' ప్రాంతాన్ని జగన్ రాజధాని కారిడార్‌గా ప్రతిపాదించారని వెల్లడించారు.

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనే పెట్రో ధరలు అధికమని, తాము అధికారంలోకి రాగానే వాటిని తగ్గిస్తామని నాడు ప్రకటించిన ప్రస్తుత సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు, మంత్రి నారా లోకేష్ వెంటనే ఆ పని చేయాలని డిమాండ్ చేశారు. నాడు పెట్రో ధరలు ప్రస్తావిస్తూ, నానా హంగామా చేసిన తండ్రీ కొడుకులు, ఇప్పుడు ఆనాటి మాదిరిగా పెట్రోల్ బంక్‌ల ముందు సెల్ఫీ దిగే దమ్ముందా? అని ఆయన సవాల్ చేశారని తెలిపారు.

# గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా జువారి రమేష్ మూడోసారి ఏకగ్రీవ ఎన్నిక



**బిఎన్ఎస్ న్యూస్ జనగామ, జూన్ 12**

జఫర్‌గఢ్ మండలం ముఖ్దుంబండ తాండ గ్రామ పరిధిలోని అవుసల తాండకు చెందిన జువారి రమేష్ తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.వామపక్ష విద్యార్థి, యువజన ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ గిరిజన హక్కుల కోసం పోరాటం చేస్తున్న జువారి రమేష్ అంచెలంచెలుగా ఎదుగుతూ ఈ బాధ్యతను మరోసారి చేపట్టడం పట్ల గిరిజన సంఘాల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.జనగామ జిల్లా కేంద్రంలోని గొబ్బెట గోపాల్ రెడ్డి భవనంలో నిర్వహించిన తెలంగాణ గిరిజన సమాఖ్య 3వ జిల్లా మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్ సమక్షంలో ఆయనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా జువారి రమేష్ మాట్లాడుతూ తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్న సభ్యులకు, సంఘం సానుభూతిపరులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో గిరిజనులపై జరుగుతున్న దాడులు, అన్యాయాలు, అఘాయిత్యాలపై గిరిజనులను సమీకరించి ఉద్యమాలు చేపడతానని పేర్కొన్నారు.తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన ప్రజాతంత్ర నాయకులకు, గిరిజన సమాఖ్య నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# వెన్నుపోటు పాలనకు రెండేళ్లు...
# ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన ర్యాలీ

## వైయస్ఆర్సీపీ శ్రేణులతో కిక్కిరిసిన సైదాపురం
## వెంకటగిరి అడ్డా నేదురుమల్లి అడ్డా అంటు నినాదాలతో మార్మోగిన వైకాపా అభిమానులు
## వెంకటగిరి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నేనె పోటీచేస్తున్న-నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి



నెల్లూరు జిల్లా సైదాపురం(బిఎన్ఎస్): -ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వెన్నుపోటు పాలనకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం మండల కేంద్రంలో వైఎస్ఆర్సిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి ప్రజలు భారీగా తరలివచ్చారు. ర్యాలీలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారీ జనసందోహంతో ర్యాలీ విజయవంతంగా సాగింది. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని నాయకులు విమర్శించారు.అదేవిధంగా కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ వెంకటగిరి నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నేనె బరిలో ఉంటానని మా అధిష్టానం క్లారిటీగా ఉందని ఎటువంటి సందేహాలు అవసరం లేదని తెలిపారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దందొలు లక్ష్మీ నారాయణరెడ్డి, సైదాపురం మండలం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మన్నారపు రవికుమార్ యాదవ్, యోగి,చిట్టెటి హరికృష్ణ, వెందోటి కార్తీక్ రెడ్డి, శ్రీనివాసరాజు, దుగ్గిరెడ్డి నరసింహరెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మియాపూర్‌లో విషాదం.. చిన్నారితో సహా ఆరో అంతస్తు నుంచి దూకిన మహిళ



మియాపూర్ (హైదరాబాద్): నగరంలోని మియాపూర్ పీఎస్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. చిన్నారితో కలిసి ఆరో అంతస్తు నుంచి దూకి మహిళ మృతిచెందింది. మయూరినగర్‌లో ఈ ఘటన జరిగింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈషా సాహూ (37) అనే మహిళ ఆరు నెలల కుమార్తెను తీసుకుని అపార్ట్‌మెంట్ ఆరో అంతస్తు నుంచి కిందికి దూకేసింది. ఈ ఘటనలో ఈషా అక్కడికక్కడే మృతిచెందగా.. చిన్నారికి స్వల్పగాయాలయ్యాయి. చిన్నారిని స్థానికులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రెండో బిడ్డ జన్మించిన తర్వాత ఈషా తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పర్వతగిరి లో మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు




**బిఎన్ఎస్ న్యూస్, పర్వతగిరి/ జూన్12**

పర్వతగిరి మండల కేంద్రంలో విషాదం నెలకొంది. ఇటీవల మరణించిన పలువురు మృతుల కుటుంబాలను సీనియర్ రాజకీయ నాయకులు,మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు శుక్రవారం పరామర్శించారు. పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన జంగా ఎల్లమ్మ, కోటి మల్లమ్మ లు గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మేడిశెట్టి రాములు ఈరోజు వారి నివాసాలకు వెళ్లి, మృతుల భౌతికకాయాలను సందర్శించి నివాళు లర్పించారు.అనంతరం శోకతప్త హృదయాలతో ఉన్న వారి కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని,మనోనిబ్బరం కోల్పోకూడదని కోరారు.వారికి తమ పక్షాన ఎల్లప్పుడూ మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శించిన వారిలో ప్యాక్స్ వైస్ చైర్మన్ సందెల నవీన్,మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్ రావు,జిల్లా పరిషత్ మాజీ సభ్యులు మహ్మద్ సర్వర్ ఉన్నారు.అలాగే స్థానిక నాయకులు గోనె సంపత్, సురేందర్ రావు,కంటెం ఏకాంతం, కొండా వెంకన్న,కంటెం సుధాకర్, ఆదొండ బిక్షపతి,వనం రవీందర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అక్కల రమేష్,పోకల శంకర్, చేరాలు, మండల మైనారిటీ నాయకురాలు సుల్తానా లతో పాటు తదితరులు పాల్గొని మృతులకు అంజలి ఘటించారు.

# భాగిర్తిపేట క్రాస్ రోడ్డు వద్ద ఘోర ప్రమాదం

## ఆర్టీఓ ఆఫీస్ ఏవో కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

**బిఎన్ఎస్ న్యూస్ భూపాలపల్లి రేగొండ**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల పరిధిలోని భాగీరథిపేట క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం ఉదయం భయంకరమైన రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భూపాలపల్లి నుండి హనుమకొండ వైపు వెళ్తున్న పరకాల డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు, ఎదురుగా హనుమకొండ నుండి భూపాలపల్లి వైపు వస్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో కారు






నడుపుతున్న హనుమకొండ ఆర్టీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న తేజావత్ రజిత (39) తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా, కారులోనే ప్రయాణిస్తున్న మరొక ప్రయాణికురాలు భూక్య లక్ష్మి (43)కి అదృష్టవశాత్తు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, ప్రయాణికులు స్పందించి క్షతగాత్రులను కాపాడారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది గాయపడిన వారిద్దరినీ తక్షణ ప్రాథమిక చికిత్స నిమిత్తం పరకాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం, బాధితులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం హనుమకొండలోని ఎన్ఎస్ఆర్ అపోలో హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రజిత, లక్ష్మిల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు, ప్రాణాపాయం తప్పినట్లు వైద్య వర్గాల ద్వారా సమాచారం అందింది. ప్రమాదం జరిగిన సమయంలో పరకాల డిపో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు అందరూ సురక్షితంగా బయటపడటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. ప్రయాణికులకు ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదం కారణంగా ప్రధాన రహదారిపై కొంత సమయం పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎస్సై సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు.పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.